ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024

'కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం'

ఆమనగల్లు, మే 18:పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి స్పష్టమైన మెజార్టీ సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం చూసి ఓటమి గ్రహించిన ప్రధాని మోదీ దిగజారుడు రాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరితతిరుపతయ్య పాల్గొన్నారు.

ఈ దారి.. పూల దారి



ఈ దారి.. పూల దారి.. ఆ మార్గంలో వెళ్లే వారికి రోడ్డుకు ఇరువైపులా చెట్లకు పూసిన పూలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు మార్గం గొట్టిగఖుర్దు సమీపంలో రోడ్డుకు కిలో మీటరు మేరకు ఇరువైపులా ఉన్న గుల్‌మోహర్ చెట్లకు పూసిన పూలు ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. కాషాయ వర్ణంలో విరగబూసిన పూలు ఈ మార్గంలో వెళ్తున్న వాహనాదారులకు పూల పందిరి వేసి స్వాగతం పలుకుతూ కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లు బాటసారులకు వేసవిలో నీడను, చల్లదనాన్ని పంచుతున్నాయి. దీంతో ప్రకృతి ప్రేమికులు, ప్రయాణికులు సెల్ఫీలు దిగుతూ మురిసిపోతున్నారు.

- బషీరాబాద్, మే 18

తెల్ల కొంగ.. నల్ల కొంగ



ఏంటీ... దున్నిన తరి పొలంలో కాకులు, కొంగలు ఇలా ఉన్నాయని ఆ శ్చర్యపోతున్నారా... అందులో కనిపించేవి కాకులు కాదు. నల్లటి రంగులో ఉన్నవి కూడా కొంగలే. సాధారణంగా మనం తెల్ల కొంగలను చూసి ఉంటాం. అప్పుడప్పుడూ నల్లవాటినీ చూసి ఉంటాం. కానీ, ఇక్కడ రెండు రంగులున్న కొంగలు ఒకేచోట కనిపించాయి. నల్లజాతి, తెల్లజాతి కొంగలన్నీ ఒకేచోట ఆహారం కోసం వెతుకుంటున్నాయి. యాచారం మండలంలోని చిన్నతూండ్లలో శనివారం నల్లజాతి, తెల్లజాతి కొంగలు ఒకేచోట చేరి సందడి చేస్తున్నాయి. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ఔరా అనుకుంటున్నారు.

- యాచారం, మే 18



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక, పాల్గొన్న వివిధ శాఖ అధికారులు

గ్రూప్-1 నిర్వహణకు
పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్, మే 18 : జూన్ 9న జరగనున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శనివారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి కలెకర్లు, అదనపు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 93 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 55,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకూ తావివ్వరాదని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్ష జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. పరీక్షల నిర్వహణకు లైజన్ అధికారులను నియమించామని చెప్పారు. అన్ని విషయాలలోనూ అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు తెలిసేలా పరీక్షా కేంద్రం పేరు, పేపర్ కోడ్, ఏరియా ఆయా పరీక్ష కేంద్రం ముందు తప్పని సరిగా ప్రదర్శించాలని సూచించారు. ఇన్విజిలేటర్లు జాప్యం చేయకుండా సరైన సమయానికి పేపర్ ఇవ్వాలని, టైం పూర్తయిన వెంటనే తీసుకోవాలన్నారు. ఉదయం10 గంటల తర్వాత ఎవరినీ పరీక్షా కేంద్రంలోని అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, రైటింగ్ పాడ్స్ అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలలోని అన్ని గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు 9 గంటలలోగా చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా చేయించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లు, డీపీవోకు సూచించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్ ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ శశాంక సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు ఇన్విజిలేటర్లు, నో రిలేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ముందు రోజు కూడా ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలని చీఫ్ సూపరింటెంట్లకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రూప్-1 పరీక్ష సజావుగా నిర్వహించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి
జయంతి ఉత్సవాలు

యాచారం/ఆమనగల్లు, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను యాచారం, మాల్ గ్రామాల్లో వైశ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవీమాత చిత్రపటానికి నివాళులర్పించారు. పేద ఆర్య వైశ్యులను ఆదుకునేందుకు కృషిచేయాలని సంఘం మండల అధ్యక్షుడు వీరబొమ్మ శ్రీనివాస్‌గుప్తా కోరారు.కార్యక్రమంలో సంఘం నాయకులు సురేందర్, లక్ష్మణ్, ప్రవీణ్, నరేష్, మనోహర్ పాల్గొన్నారు. ఆమనగల్లులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో పూజలకు ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవతో అమ్మవారికి మేలుకొలుపు పాడారు. అనంతరం వాసవీ మాత మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించారు. మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆలయ కమిటీ బికుమాండ్ల నర్సింహ, శ్రీనివాస్, బి.పాండయ్య, పి.రాము, ఎ.శ్రీనివాస్, రాజు, లక్ష్మయ్య, సురేశ్, కృష్ణయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో కుంకుమార్చన పూజల్లో మహిళలు



ఒకవైపు అకాల వర్షాలు పడుతున్నాయి. హమాలీల కొరతతో మార్కెట్ యార్డుల్లో ధాన్యం కాంటాలు కావడం లేదు. ధాన్యం అమ్మకాల నెమ్మదిగా సాగుతుండడంతో మార్కెట్లలో గుట్టలుగా ధాన్యపు రాశులు పేరుకుపోతున్నాయి. మార్కెట్ కమిటీలు, అధికారులు దీని గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో.. తమ ధాన్యం ఎక్కడ తడిసి నష్టాల పాలు కావలసి వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

కల్లాల్లో ధాన్యం..
కళ్లల్లో దైన్యం!

- కొనుగోలు కేంద్రాల్లో గుట్టలుగా ధాన్యం రాశులు
- అకాల వర్షాలతో భయాందోళనలో రైతులు

హమాలీల కొరతతో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

ఇబ్రహీంపట్నం, మే 18: ఇబ్రహీంపట్నం పరిధిలో హమాలీల కొరతతో ధాన్యం కోనుగోళ్లకు ఇబ్బందిగా మారింది. కల్లాల్లోనే నిల్వలు పేరుకుపోతున్నాయి. స్థానికంగా ఎవరూ హమాలీలు రావడం లేదు. బిహార్‌కు చెందిన హమాలీలే ధాన్యాన్ని నింపి లారీల్లోకి ఎత్తుతున్నారు. వీరి సంఖ్య తక్కువగా ఉండడంతో ఎక్కడికక్కడ నిల్వలు పెరిగిపోతున్నాయి. పైగా రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం నిల్వలు పోసుకుని రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చినా సకాలంలో ధాన్యం అమ్ముకోలేకపోతున్నారు. ఇబ్రహీంపట్నం, దండుమైలారం, యాచారం, మంచాల, బోడకొండలలో డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండగా పోల్కంపల్లిలో ఫ్యాక్స్‌ద్వారా, నందివనపర్తిలో మహిళా సంఘాల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే ఎన్నికల మూలంగా మూడు, నాలుగు రోజులపాటు కొనుగోళ్లు ఆగిపోయాయి. 15 రోజులుగా ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండగా డీసీఎంఎస్ ద్వారా ఐదు కేంద్రాల్లో ఇప్పటికి కేవలం 3,200 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. అకాల వర్షాలతో మార్కెట్లో పోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందో తెలియకుండా ఉందని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఒక్క రాయపోల్ గ్రామంలోనే సుమారు 50మంది రైతులు ఇక్కడ బండ దగ్గరే ధాన్యం కుప్పలుగా పోసి నిల్వ చేశారు. 2,400 టన్నుల ధాన్యం ఇక్కడే నిల్వ ఉంది. పైగా ధాన్యం కుప్పల నిల్వల కోసం వాడుతున్న పడాల కిరాయి రోజు రోజుకు పెరుగుతుంది.

దళారులకు అమ్మితే అసలుకే మోసం..

దళారీలు నేరుగా కల్లాల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కాకుండే వారు క్వింటాలుకు రూ.1,700-1,750 మాత్రమే ధర చెల్లిస్తున్నారు. అదీగాక కల్లాల నుండే ధాన్యం ఆరబెట్టకుండా నేరుగా ట్రాక్టర్ల ద్వారా రైస్ మిల్లులకు చేరవేస్తే రూ.1,700కే క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. పైగా తరుగు, తాలు పేరుతో క్వింటాలుకు 6 నుంచి7 కిలోలు కోత పెడుతున్నారు. దీంతో రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది.



ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్‌లో లారీల్లో ఎత్తడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

ఇరవై రోజులుగా పడిగాపులు గాస్తున్నం



ఇరవై రోజులుగా ధాన్యం కల్లాల్లోనే కుప్పలుగా నిల్వ చేస్తున్నాం. నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్దామంటే హమాలీల కొరత ఉంది. డీసీఎంఎస్ అధికారులు రెండు లారీల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన ధాన్యం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని వెంటనే ధాన్యాన్ని ఎత్తుకెళ్లాలి.

- దొండ విష్ణువర్ధన్‌రెడ్డి, రాయపోల్ రైతు

హమాలీలదే పెద్ద సమస్యగా ఉంది

స్థానికంగా హమాలీలు ఎవరూ రావడం లేదు. బిహార్‌కు చెందిన హమాలీలతోనే నెట్టుకొస్తున్నాం. రాయపోల్ గ్రామంలో నిల్వచేసిన ధ్గగర నుండి నేరుగా ధాన్యం కొనుగోలుకు చేసే ప్రయత్నం చేయగా అక్కడ రైతులు హమాలీలతో తమ సిబ్బందితో గొడవకు దిగారు. అయినా కొనుగోళ్లలో వేగాన్ని పెంచుతున్నాం.

- రాజు, ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్ మేనేజర్

జోరు వాన

- ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు
- రోడ్లపై ప్రవహించిన వరద నీరు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం

చౌదరిగూడ/యాచారం/శంకర్‌పల్లి/మంచాల, మే 18 : రంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షం అన్నదాతను నిండా ముంచేస్తోంది. చౌదరిగూడ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రైతులు పండించిన పంటను వ్యవసాయ పొలాల వద్దనే ఏర్పాటు చేసుకున్న కల్లాల్లో ఆరబోయడంతో ఈ వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. దీంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులతో కవర్లు తెచ్చి కప్పి ధాన్యాన్ని కాపాడుకున్నారు. ఒకేసారి వర్షంతో పాటు తీవ్రమైన గాలి వీచడంతో వడ్లు తడిసిపోయి టార్పాలిన్లు కొట్టుకు పోవడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. ఎక్కువ వర్షం పడి వడ్లు తడిస్తే తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. యాచారం మండలంలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈదురు గాలుల కారణంగా పలుచోట్ల చెట్లు నేలకూలాయి. యాచారం, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, నందివనపర్తి, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి తండా తదితర గ్రామాల్లో కుంభవృష్టి కురియడంతో రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. యాచారంలో 2సెం.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా శంకర్‌పల్లి పట్టణం, మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు లెవలింగ్ కోసం ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు తీయగా.. వర్షానికి నిండాయి. దాంతో పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంకర్‌పల్లి మండలంలో 5.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంచాల మండలంలో తేలికపాటి వర్షం కురిసింది.



చౌదరిగూడలో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

వర్షపాతం వివరాలు

ప్రాంతం	వర్షపాతం (మి.మీలలో)
శేరిలింగంపల్లి	68.80
వనస్థలిపురం	51.50
శంకర్‌పల్లి	50.30
కడ్తాల	44.50
సరూర్‌నగర్	39.00
ఉప్పల్	38.30
నవాబుపేట	37.80



శంకర్‌పల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



చేవెళ్లలోని మోడల్ స్కూల్

మోడల్ స్కూళ్లలో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, మే 18: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో అడ్మిషన్‌కు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దదఖాస్తు చేసుకోవాలని చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. టెన్త్ పాసైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ఒక్కో మోడల్ స్కూల్‌లో ఫస్టియర్‌లో 160 సీట్లు ఉన్నాయన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, గ్రూపులు ఉన్నాయన్నారు. మెరిట్ ప్రాతిపదికన ఈ నెల 26న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తామని, 27 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ప్రవేశం పొందిన బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు.

కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కందుకూరు: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో బోధిస్తామన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎలాంటి ఫీజు లేకుండా తమ కళాశాలలో నేరుగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధనుంటుందని తెలిపారు. వివరాలకు 9398966592 లేదా 8542546850నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మేడ్చల్ మే 18(ఆంధ్రజ్యోతి) : ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతూ పరీక్షలను సంబంధిత అధికారులు ఇతర అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. జిల్లాలో 50,443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, 89 సెంటర్లు ఉన్నాయన్నారు. మొదటి సంవత్సరంనకు గాను 36,940, ద్వితీయ సంవత్సరం 13,503 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రతీ రోజు తాగునీటిని ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. డీఐఈవో కిషన్, ఏసీపీ చంద్రకుమార్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి సతీష్, పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

● వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

దోమ, మే 18: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. శనివారం దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను సూచించారు. తరుగు, తాలు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయి, తేజ, రైతులున్నారు.


బొంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏవో

శిఖం భూమిలో ఆక్రమణలు తొలగించండి

కొత్తూరు. మే 18 : కొత్తూరు మున్సిపల్ పరిధిలోని చెరువు శిఖంలో నిర్మించిన ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కొత్తూరు తండా వాసులు పత్లావత్ రెడ్యానాయక్, బాలునాయక్, రమేష్‌నాయక్, సోమ్లా నాయక్, రవినాయక్, నరేందర్ నాయక్, గోపాల్‌నాయక్, బాబు నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 64లో నిర్మించిన వాటర్‌ఫిల్టర్, సర్వేనెంబర్ 83, 66లో ఆక్రమణలను తొలగించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్, ప్రభాకర్ గౌడ్

మూడుచింతలపల్లి, మే 18: మండలంలోని కేశవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ హాజరై స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు, గ్రామస్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింహులు, రాజేంద్రప్రసాద్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి


ద్వారకనగర్‌లో మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు

ఘట్‌కేసర్, మే 18 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని 18వ వార్డు పరిధిలో గల ద్వారకనగర్‌లో మురుగునీరు రోడ్డుపై పారుతున్న పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణంను అస్తవ్యస్తంగా చేపట్టడంతో మురుగు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వస్తున్నదని వాపోతున్నారు. మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనతో సతమతమవుతున్నామని స్థానికులు ఆరోపించారు. కాగా, గత ఆరునెలలుగా మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. స్థానిక కౌన్సిలర్ చెప్పిన మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాలనీవాసులు హెచ్చరించారు.

కేబుల్ కోసం రోడ్ల పక్కన గుంతలు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

మర్పల్లి, మే 18: కేబుల్ వేసేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన ఇష్టానుసారంగా గుంతలు తీసిరోడ్లపై మట్టి వేయడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాగిరెడ్డిపల్లి చౌరస్తా వరకు జియో కేబుల్ కోసం గుంతలు తీసి మట్టిని రోడ్డుపై పడేయడంతో తరచూ వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆ మార్గంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.


రోడ్డుపక్కన కేబుల్ వేసేందుకు తవ్విన గుంతలు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

వికారాబాద్, మే 18 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జూన్ 9న నిర్వహించే పరీక్షకు సంబంధించి శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు వీలుగా 13 కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. వికారాబాద్‌లో 7, తాండూరులో 4 పరిగిలో 2 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహిస్తాం : ఎస్పీ కోటిరెడ్డి

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను భారీ పోలీసు బందోబస్తు మధ్య శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మహిళా కానిస్టేబుల్, హోంగార్డులు విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జరదేఖో..

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పాటిగడ్డ సమీపంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

కేశంపేట, మే 18 : మండల పరిధిలోని అల్వాల-కేశంపేటకు వెళ్లే దారిలో పాటిగడ్డ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు వెళ్లే 11 కేవీఏ లైన్‌కు సంబంధించిన స్తంభం పాటిగడ్డ సమీపంలో ఒక వైపుకు ఒరిగిపోయింది. కాగా, ఎన్నో రోజుల నుంచి విద్యుత్ స్తంభం అలాగే ఉంటుందని సమీప రైతులు తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండాలంటే దానిని వెంటనే సరిచేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా చాలా చోట్ల కరెంటు వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించాలని రైతులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అప్పుడు 40.. ఇప్పుడు 22 రోజులు


● లోక్‌సభ ఎన్నికల ఫలితాల కోసం నిరీక్షణ

తాండూరు, మే 18: లోక్ సభ ఎన్నికల ముగిసిన రోజు నుంచి ఫలితాల వెల్లడి కోసం 22 రోజులు నిరీక్షించాల్సిందే. దేశవ్యాప్తంగా ఏడు విడతలుగా ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం ఈనెల 13న నాలుగో విడత ఎన్నికలు ముగిశాయి. మరో మూడు దశల్లో పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. కాగా, అన్ని దశలు పూర్తి అయ్యాక జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపడతారు. అదేరోజు రాత్రి వరకు ఫలితాలు వెల్లడిస్తారు. ఇదిలా ఉంటే, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ ముగిసిన తర్వాత 40 రోజులు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. కాగా, చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పాటు మొత్తం 43 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం విదితమే. ప్రస్తుతం మూడు పార్టీలు లెక్కింపునకు చాలా సమయం ఉండడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బూత్ వారిగా పడిన ఓట్ల వివరాలు తీసుకొని గ్రామం, వార్డు యూనిట్‌గా లెక్కలతో కుస్తీ పడుతున్నారు. అనేక కోణాల్లో విశ్లేషణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ భయం కూడా జరిగిందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.


ఎవరు గెలిచినా రికార్డే

● రసవత్తరంగా చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పోరు

● విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి.. ఎవరు గెలిచినా రెండోసారి ఎంపీ



గడ్డం రంజిత్‌రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, మే 18: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవరు గెలిచినా రికార్డేనని చెప్పవచ్చు. ఈ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికలు హోరా హోరీగా సాగిన విషయం విదితమే. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌లు పోటీలో నిలిచారు. ఇందులో విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఇద్దరు రెండోసారి పోటీలో నిలిచారు. కాసాని జ్ఞానేశ్వర్ కూడా పార్టీ మారి ఎంపీ బరిలో నిలబడ్డారు. 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో దిగి.. కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిపై గెలుపొంది మొదటిసారి ఎంపీ అయ్యారు. 2019 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి బరిలో నిలిచి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై 14 వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. ఈ ఇద్దరూ కూడా పార్టీ మారారు. ఆ తర్వాత పోటీ పడుతున్న ప్రస్తుత ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డి గెలిచినా.. రంజిత్‌రెడ్డి గెలిచినా.. అదే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎన్నికయ్యే చాన్స్ ఉంది. ఇద్దరూ ఈ ప్రాంత సమస్యలు తెలిసిన నేతలు. ఎవరు గెలిచినా రికార్డే. పార్లమెంటు స్థానాల పునర్విభజన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో ఒక్కసారే చాన్స్ వచ్చింది. కానీ, ఈసారి గెలుపొందే వారికి రెండోసారి చాన్స్ వస్తుంది.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, మే 18: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలుర నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారామ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇక్కడే పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీట్లు పోను.. మిగతా సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన జిల్లా, మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 23న కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ధ్రువపత్రాలతో విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

'మహా' జోన్లు మరో రెండు

● హెచ్‌ఎండీఏలో పాలనా సౌలభ్యానికి 6కు పెంపు

● శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్ల విభజన

● మరింత వేగం కానున్న భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు



హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)లో పాలనా సౌలభ్యం, భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో మరింత వేగవంతానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధిలో, రియల్ ఎస్టేట్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడంలో కీలకమైన హెచ్‌ఎండీఏను ప్రజలకు మరింత దగ్గరకు చేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హెచ్‌ఎండీఏలో అతిపెద్ద జోన్లుగా ఉండి రియాల్టీ వృద్ధికి దోహదపడుతున్న శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్లను విభజన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు జోన్లను విభజించి అందుకనుగుణంగా అధికారులను, ఉద్యోగులను నియమిస్తుండడంతో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు మరింత సులభతరం కానున్నాయి. హెచ్‌ఎండీఏలోని పట్టణ ప్రణాళిక విభాగాన్ని పటిష్ఠ పరిచే దిశగా చర్యలు చేపట్టారు.

> హైదరాబాద్ మహా నగరంలో పలు రంగాల అభివృద్ధిలో వేగాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాలనా సౌలభ్యానికి అనుగుణంగా జోన్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతమున్న నాలుగు జోన్లు కాస్త ఆరు జోన్లుగా మారనున్నాయి.

హైదరాబాద్‌తో పాటు మరో ఆరు జిల్లాల్లో 7,257చదరపు కిలోమీటర్లలో హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించి ఉంది. ఇందులో 70 మండలాలు, సుమారు వెయ్యి గ్రామ పంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మున్సిపాలిటీలున్నాయి. ఆయా ప్రాంతాలను ఆధారంగా చేసుకుని హెచ్‌ఎండీఏ ఏర్పడిన సందర్భంలో నాలుగు జోన్లు (శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్)గా ఏర్పాటు చేశారు. ఆయా జోన్ల పరిధుల్లో కనీసం 15 మండలాల నుంచి 20 మండలాల వరకు ఉంటాయి. హెచ్‌ఎండీఏ పట్టణ ప్రణాళిక విభాగానికి కీలకమైన ఈ జోన్లకు ప్లానింగ్ ఆఫీసర్, ఏపీఓ, జేపీఓ ఇతర ఉద్యోగులుంటారు. ఆయా జోన్లలో మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయడంతో పాటు లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు, భూ వినియోగ మార్పిడులు, ఎన్‌ఓసీలను వీరు జారీ చేస్తారు.

విస్తరణతో పెరిగిన ఒత్తిడి

దశాబ్ద కాలంలో హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలు గణనీయంగా విస్తరిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు కేంద్రంగా చేసుకుని జరుగుతున్న అభివృద్ధితో పెద్దఎత్తున లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు వస్తున్నాయి. పలు రకాల పరిశ్రమలు, గోడౌన్లు, మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు, ఆటోమొబైల్ తదితర రంగాలకు చెందిన కంపెనీలు భారీగా శివారు ప్రాంతాల్లో ఏర్పడుతున్నాయి. దీంతో హెచ్‌ఎండీఏకు యేటా వివిధ రకాల అనుమతుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు, గోడౌన్లు, పెట్రోల్ బంక్‌లు ఇలా వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులతో హెచ్‌ఎండీఏలో ప్లానింగ్ విభాగంపై భారీగా ఒత్తిడి పెరిగింది. 2012 తర్వాత ఒక్క ఖాళీ పోస్టును కూడా భర్తీ చేయలేదు. దీంతో ప్లానింగ్ విభాగంలో 110మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సిన చోట 30మందితోనే నెట్టుకొస్తున్నారు. నగరం చుట్టూరా జరుగుతున్న అభివృద్ధి, పెరుగుతున్న దరఖాస్తులతో ప్లానింగ్ విభాగంలోని జోన్లపై ఒత్తిడి పెరిగింది.

శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్ల విభజన

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిలో కీలకమైన హెచ్‌ఎండీఏలోని ప్లానింగ్ విభాగాన్ని పటిష్ఠపర్చాల్సి ఉండగా పదేళ్లుగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కొందరు అధికారులదే ఇష్టారాజ్యంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏపై ప్రత్యేక దృష్టిసారించారు. హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలో కీలకమైన నాలుగు జోన్లను ఆరుకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చే శంకర్‌పల్లి జోన్‌ను రెండుగా విభజించి పటాన్‌చెరు లేదా సంగారెడ్డిని మరో జోన్ చేయాలని, దాదాపు 20కి పైగా మండలాలతో ఉన్న ఘట్‌కేసర్ జోన్‌ను రెండుగా విభజించి రాచకొండ జోన్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జోన్లను విభజించి సంబంధిత పీవో, ఏపీవో, జేపీవో, డీపీవో ఇతర సిబ్బందిని నియమించనున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులపై పని ఒత్తిడి కూడా చాలా వరకు తగ్గనుంది. ప్రతీ దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతులు వేగంగా ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. కాగా, జోన్ల పెంపుతో బహుళ అంతస్తుల భవనాలు, లేఅవుట్ల అనుమతులు హెచ్‌ఎండీఏలో మరింత వేగవంతమవుతాయని, దాంతో రియల్ ఎస్టేట్ వృద్ధికి, ఇతర రాష్ట్రాల సంస్థలను కూడా ఆకర్షించడానికి అవకాశాలుంటాయని ఈ సందర్భంగా ఓ ఉన్నతాధికారి తెలిపారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి, మే 18: పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'నీటికుంట కాదు... మార్కెట్ యార్డు..!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఈ మేరకు శనివారం పరిగి మార్కెట్‌యార్డులో పర్యటించారు. రైతులు, వ్యాపారులతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించే స్థలాల్లో నీటికుంటలను చూసిన ఎమ్మెల్యే.. ఇదేం ఘోరం అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత ఘోరంగా ఉంటే మార్కెట్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం నీరు వెళ్లిపోయేలా చేసి, మట్టి పోసే పరిస్థితిలోనైనా ఉన్నారా? లేరా అని ప్రశ్నించారు. మార్కెట్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఏమేం పనులు చేపట్టాలో ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌యార్డులో రైతులు, వ్యాపారులకు, ప్రజలకు అన్నివసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కష్ణప్రసాద్, వ్యాపారులు బాల్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ధాన్యం కొనుగోలుకు సత్వర చర్యలు

● ప్రతీ వడ్ల గింజను కొనుగోలు చేస్తాం

● వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్, మే 18 : వికారాబాద్ జిల్లాలో యాసంగిలో రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం తాండూరు మండల పరిధిలోని చెంగోల్ గ్రామ శివారులో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చెంగోల్ నుంచి ఎంతమంది రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేశారని తాండూరు గోదాం ఇన్‌చార్జి ఎల్లప్పను అడిగారు. కాగా, 17శాతం తేమ ఉన్న ధాన్యాన్నే తీసుకురావాలని, తేమ శాతం తక్కువ ఉంటే ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని లింగ్యానాయక్ సూచించారు. ప్రతిరోజు 4-5 లారీల ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని లారీలో నింపేందుకు కూలీల సంఖ్యను కూడా పెంచాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓపీఎంఎస్ ట్యాబ్) పొందుపర్చాలని ఆదేశించారు. టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 129 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా లక్షా 19వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా కాగా, ఇప్పటివరకు 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.8కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. తరుగు కూడా ఎక్కువ తీయవద్దని, ఒక బస్తాకు 650 గ్రాముల వరి ధాన్యాన్ని తీయాల్సి ఉంటుందన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ తారాసింగ్, డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, ఆర్‌ఐ బాల్‌రాజ్, చెంగోల్ గ్రామ రైతులు తదితరులున్నారు.



తాండూరు రూరల్ : కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి

పెద్దేముల్ : అకాల వర్షాలు కురుస్తున్నాయని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన రైతుల ధాన్యం తడిసిపోకుండా అవసరమైన టార్పాలిన్లు అందజేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను లింగ్యానాయక్ ఆదేశించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ప్రశ్నించారు. టార్పాలిన్లు ఇవ్వడం లేదని, పూర్తిస్థాయిలో లేకపోవడం ధాన్యం తడిసిపోతోందని రైతులు చెప్పారు. దాంతో వారికి టార్పాలిన్లు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

బొంరాస్‌పేట్/యాలాల : రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని తుంకిమెట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు ధాన్యం కొనుగోలుపై ఎలాంటి అపోహలకు గురికావొద్దని తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యాలాల మండలం బెన్నూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని లింగ్యా నాయక్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్దతు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యన్ని సేకరించాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని ఆయన ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు చేరే విధంగా చర్యలు తీసుకోవాని, ధాన్యాన్ని సేకరించి మేనేజ్‌మెంట్ సిస్టంలో పొందుపరచాలని తెలిపారు. ధాన్యం శుభ్రపరిచి, తేమశాతాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చేలా రైతులకు వివరించాలన్నారు.

గ్రామాల్లో మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి

● 2024 జనవరి 31తో ముగిసిన పాలక వర్గాల గడువు

● ఐదారు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు

● మరో నెలలో ఎన్నికలు.. ఏర్పాట్లలో అధికార యంత్రాంగం!

● పార్టీల నాయకుల్లో మొదలైన టెన్షన్..

మహేశ్వరం, మే 18 : మొన్నటి వరకు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల హడావిడిలో మునిగితేలిన నాయకులకు.. ఇక పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిపోగా.. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే పల్లెలు కాలం వెల్లదీస్తున్నాయి. జూన్, జూలైలోనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని వార్తలు గుప్పుమనడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించిందన్న వార్తలు గ్రామాల్లో కోడై కూస్తున్నాయి. ఐదు నెలల క్రితమే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను టీ పోల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటివరకు గ్రామ పంచాయతీల వారిగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారిగా విభజించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నారు. ఇప్పటికి మండలంలో మొత్తం 67,983 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 31 గ్రామపంచాయతీలు, 268 వార్డులు ఉండగా.. వీటికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల్లో సర్పంచులుగా కావాలనే ఆశతో ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో బిజీ బిజీగా ఉన్న నాయకులు ఇకనుంచి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కాక తప్పడంలేదు. ఎన్నికల సమయం రోజు రోజుకూ దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లో ఎక్కువశాతం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిదులు ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొందరు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకోవడానికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఏమవ్వా బాగున్నావా? ఏం తాత బాగున్నావా? అంటూ ఆప్యాయతతో పలకరింపులు మొదలయ్యాయి. కొన్ని మేజర్ గ్రామ పంచాయతీల్లో మాత్రం ఓటుకు రూ.5 నుంచి 10 వేలు కూడా ఖర్చు చేయడానికి నేతలు తగిన వనరులను సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. అయితే, మహేశ్వరం మండల కేంద్రంతో పాటు సిరిగిరిపురం, మన్‌సాన్‌పల్లి, గంగారం, తుమ్మలూరు, మొహబత్‌నగర్, కేసీ తండా, ఎన్డీతండాలను కలుపుకొని మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే మాత్రం 31 గ్రామ పంచాయతీల్లో 8 మున్సిపల్ పరిధిలోకి వస్తే 23 గ్రామాలకు మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.



తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం



విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన మురుగుతో నిండిన కాలువ

అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ

● పట్టించుకోని అధికారులు.. స్థానికుల ఇబ్బందులు

బషీరాబాద్, మే 18: మండల కేంద్రంలో మురుగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేక పాలనలో నిధులలేమి, పట్టించుకునే వారు కరువై ఎక్కడికక్కడా మురుగుకాల్వలు నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఫలితంగా మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డులోని కల్వర్టు కింద కాల్వ నిండి మురుగునీరు రోడ్డెక్కుతోంది. ఈ కాలువ చెత్తాచెదారంతో పూడుకుపోయి మురుగునీరు ముందుకు పారడం లేదు. కాల్వకు అటువైపు పాడుమట్టిని వేయడంతో మురుగునీటికి పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ కాల్వను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది అప్పడప్పుడూ శుభ్రం చేస్తున్నా.. పరిస్థితి మాత్ర యధావిధిగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, మే 18 : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆ లయంలో పల్లకీ సేవను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పూజలానంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేశారు. షాద్‌నగర్‌కు చెందిన మంగ-రాజు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కక్కులూరుకు చెందిన కృష్ణయ్య 20కిలోల బియ్యం, గంట్లవెల్లి గ్రామానికి చెందిన తులసీరామ్‌నాయక్ 5కిలోల నూనె ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ప్రతీ శనివారం నిర్వహిస్తున్న పల్లకీ సేవకు సహకారం అందిస్తున్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.శ్రీశైలంగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కోడ్ ముగియగానే అభివృద్ధి పనులు

కొత్తూరు, మే 18: లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే మండలంలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ఎంపీడీవో అన్నారు. శనివారం ఎంపీపీ పిన్నింటి మధుసూధన్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రెండు నెలలుగా ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు నిలిచాయన్నారు. జూన్ 6న కోడ్ ముగియగానే పాత, కొత్త పనులు చేపడుతామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉండి ప్రజాసమస్యలు పరిష్కారానికి కృషిచేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూధన్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

కేశంపేట, మే 18: మండల పరిధి పొమాల్‌పల్లిలో ఇటీవల మృతిచెందిన బావండ్ల జంగమ్మ, నిదురం భారతమ్మల కుటుంబాలకు జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి రూ.5వేల సాయం ప్రకటించారు. ఈ మేరకు నగదును కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, రమేష్ శనివారం అందజేశారు. చెంద్రారెడ్డి, ముత్యాల్‌రెడ్డి, శ్రీనివాసు ఉన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

కందుకూరులో రైతులకు అవగాహనా సదస్సు

కందుకూరు, మే 18 : నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏడీహెచ్ సంజయ్‌కుమార్, మహేశ్వరం ఏడీఏ సుజాత అన్నారు. శనివారం కందుకూరులోని రైతు వేదికలో 'వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్‌సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ' ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ అధికారులు నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువ అన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల అనంతరం ఏటా ఎకరానికి 8 నుంచి 12టన్నుల ఆయిల్ పామ్ కాయల దిగుబడి వస్తాయన్నారు. ఆయిల్ పామ్ సాగుచేయాలనుకునే రైతులకు మొక్కలకు 90శాతం రాయితీ, డ్రిప్ ఏర్పాటుకు 80 శాతం నుంచి వంద శాతం రాయితీ వస్తుందన్నారు. మొక్కలు ఎదిగే వరకు నాలుగేళ్ల వరకు ఎకరానికి రైతుకు రూ.4,200 చొప్పున ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే పంట మొదలైనప్పటి నుంచి 30ఏళ్ల పాటు రైతు దిగుబడి పొందుతాడన్నారు. కేవలం నీరు పెట్టి పైపాటు ఎరువులు వేస్తే సరిపోతుందన్నారు. పంట మార్కెటింగ్‌కు దిగులుచెందాల్సిన అవసరం లేకుండా కంపెనీ వారే పంటను కొంటారన్నారు. ఎకరానికి 50 వరకు ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవాలన్నారు. ఈ పంటలో అంతర పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. ఇది అదనపు ఆదాయం అన్నారు. ఉన్న రైతులు జూన్ 5వ తేదీకల్లా ఫీల్డ్ అసిస్టెంట్ లేదా ఉద్యావన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం రైతులకు రాయితీలు మంజూరవుతాయన్నారు. కంపెనీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు తమ కంపెనీ ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లాలోని 16మండలాల్లో తమ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బి.జంగారెడ్డి, ఎంపీపీ ఎం.జ్యోతి, వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి సౌమ్య, ఏవో లావణ్య, ఏఈవో రాజు, ఎఫ్‌వో మల్లేష్ పాల్గొన్నారు.


కందుకూరు: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహేశ్వరం ఏడీఏ సుజాత

తంగళ్లపల్లిలో అవగాహన సమావేశం

కొందురు: పామాయిల్ సాగుపై తంగళ్లపల్లిలో రైతులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ పామాయిల్ సాగుకు తక్కువ పెట్టుబడి అవసరమవుతుందని, ఇతర పంటలతో పోలిస్తే నికర లాభాలు ఎక్కువన్నారు. కొందుర్గు మండలంలో 500ఎకరాల్లో పామాయిల్ సాగు చేయించాలనే లక్ష్యం ఉందని, ప్రస్తుతం 45ఎకరాల్లో సాగవుతోందన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్‌పూర్ మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, తంగళ్లపల్లి క్లస్టర్ ఏఈవో అనూష, శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణ, బాల్‌రాజ్, రాఘవరెడ్డి, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, చెన్నయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింలు, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.


కొందుర్గు: అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్

'ధరణి'ని సరిచేయడంలో ప్రభుత్వం విఫలం


మల్గారి వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, మే 18 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి పోర్టల్‌ను విస్మరించిందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ చేవెళ్ల మండల యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో ధరణి పోర్టల్ నిర్వహణ దారుణంగా మరిందన్నారు. ఈసీ, రిజిస్ట్రేషన్, సేల్ డీడ్ వంటివి కూడా డౌన్‌లోడ్ కావడం లేదన్నారు. కోర్టు తీర్పు వచ్చిన వాటికీ ప్రొహిబిటెడ్ లిస్టులో ఉంచుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి 'ధరణి'ని సరిచేయడంతో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునేందుకు భూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే యత్నం చేస్తోందని, కానీ ధరణిలోని లోటుపాట్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పోర్టల్‌లోని లోపాలను సవరించాలన్నారు.

'స్థానికం'లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, మే 18 : రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచి చిత్తశుద్ధిని చాటుకోవాలని బీజేపీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు జి.కృష్ణాగౌడ్ అన్నారు. శనివారం చేవెళ్లలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్టు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 22 నుంచి 42శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ఊరుకోం అని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రిజర్వేషన్ల పెంపుపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో కృష్ణమోహన్, మహేశ్ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యాదిలాల్



ఆమనగల్లు,మే18:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్, న్యాయవాది అండేకార్ యాదిలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరినట్టు యాదిలాల్ తెలిపారు.

కపిల్ సిబల్‌ను కలిసిన జగన్



ఆమనగల్లు, మే18: సుప్రీంకోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను శనివారం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన సుప్రీం కోర్టు న్యాయవాది, తెలంగాణ ప్రజారోగ్య బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు.జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని సుప్రీంకోర్టు వద్ద సిబల్‌ను కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కరించాలని కపిల్ సిబల్‌ను కోరినట్టు జగన్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న బాషయ్య తదితరులు

మంచాల, మే 18: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటనే మిల్లులకు తరలించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.జంగయ్యతో కలిసి శనివారం మంచాలలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో తాలు, తడి పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. క్వింటాలుకు 5కిలోల చొప్పున కోత విధిస్తున్నారని, ఇది ప్రభుత్వ దోపిడీ కాదా? అని ప్రశ్నించారు. తూకం వేసి రైస్‌మిల్లుకు పంపిన ధాన్యం బస్తాలను తిరిగి పంపారని ఇందుకు బాధ్యులైన అధికారలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించి రైతులకు డబ్బులు విడుదల చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నేతలు వెం కట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నూకంరాజు, రాజేందర్‌రెడ్డి, కృష్ణ, మోహన్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, మే 18:అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నంకాకుండ చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తలకొండపల్లి మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్‌లో ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే, జడ్పీటీసీ వెంకటేశ్, వైస్‌ఎంపీపీ మ్యాక శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో శాఖల వారీ సమీక్ష నిర్వహించారు. రైతుబంధు అందరు రైతులకు అందలేదని ఎంపీటీసీలు, జడ్పీటీసీ ప్రస్తావించారు. అయితే అందరికీ రైతుబంధు వేశామని ఏవో రాజు తెలిపారు. రైతుబంధు రాని రైతులకు వెంటనే ఇవ్వాలని ఏవోను ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ అధికారులు సరిగ్గా పనిచేయడంలేదని సభ్యులన్నారు. ముందే వానకాలం రానుందని, వెంటనే తీగలు, పోల్స్ సరిచేయాలని ఏఈ కటారియాను కసిరెడ్డి ఆదేశించారు. తలకొండపల్లి ఆరోగ్య కేంద్ర భవనం పైకప్పు పెచ్చులూడుతోందని, నీరు సరఫరా సరిగ్గా లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ, ఎంపీపీ తెలిపారు. భవన మరమతులకు నిధులు మంజూరు చేయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కుక్క, పాము కాటుకు మందులను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ వైద్యసేవలందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీటీసీ అంబాజీ కోరారు. విజయ డెయిరీ నుంచి రైతులకు రావాల్సిన బకాయిలను అందించేలా చూడాలని ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ, ఎంపీటీసీలు కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ రంగారెడ్డి, ఏపీఎం శ్రీదేవి, ఎంఈవో సర్దార్‌నాయక్, ఏవో రాజు, ఏఈ విద్యాసాగర్, వైద్యులు కల్పన, సైదమ్మ, ఎంపీటీసీ సభ్యులు జోగు రమేశ్, సుధాకర్‌రెడ్డి, అంబాజీ, రఘునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సోని, హేమరాజు, సరితగణేశ్ పాల్గొన్నారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి కృషి


ఆలయ కమిటీకి నగదును అందజేస్తున్న కూతురు మహేందర్

షాబాద్, మే 18 : మండల పరిధి అంతిరెడ్డిగూడలో నిర్మిస్తున్న బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ తరఫున శనివారం రూ.20వేలను ఆలయ కమిటీకి అందజేసినట్లు యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళమిచ్చిన బీజేపీ, మోర్చా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాచన్‌పల్లి బూత్ అధ్యక్షుడు కావలి శివ, గ్రామస్తులు రాజు, సాయి, అరుణ్, సురేష్, రమేష్, శ్రీనివాస్, నవీన్, వివేక్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం ఇస్తున్న పాండురంగంగుప్తా

షాద్‌నగర్ అర్బన్: ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త పలబట్ల పాండురంగం గుప్తా 1.11లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణ కో-ఆర్డినేటర్లు కక్కునూరి వెంకటేష్‌గుప్తా, అన్మారి వెంకటయ్యలకు పాండురంగంగుప్తా, ఆయన కుమారుడు శివకుమార్ ఈ మేరకు డబ్బును అందజేశారు. ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చిన పాండురంగం కుటుంబసభ్యులకు ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలిపింది. మరింత మంది దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం

మహేశ్వరం, మే 18: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయని మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ అన్నారు. మహేశ్వరంలోని అక్కన్న మాదన్న క్రీడాప్రాంగణంలో మహేశ్వరం వాలీబాల్ ప్రీమియర్ లీగ్-2ను శుక్రవారం ప్రారంబించారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజం అని, పట్టుదలతో కీడ్రాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాల కోరారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. అక్కన్న మాదన్నల క్రీడాప్రాంగణం ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దిందన్నారు. క్రీడాకాలను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో వత్తుల రఘుపతి, కాకి ఈశ్వర్, మాజీ సర్పంచ్ ఆనందం, ఎం. నవీన్, రాజేష్ ప్రభాకర్, పి.బాలయ్య, శ్రవణ్, కుమార్, యాదగిరి, పరమేష్, జె.రమేష్, వీరు బాబు, అస్లాం, అజ్గర్ తదితరలుఉ పాల్గొన్నారు.


వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

కీసర రూరల్, మే 18: వృద్ధురాలి మెడలోంచి దుండగులు పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. ఈ ఘటన కీసర మండలంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జెల్ల రాములమ్మ(75) అనే వృద్ధురాలు మండలంలోని అంకిరెడ్డిపల్లిలో తన కుమారుడి సంరక్షణలో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోని వారంతా పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. ఇంట్లో రాములమ్మ ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె మెడలోంచి నాలుగు తులాల బంగారు గొలుసును దొంగలు దోచుకెళ్లారు. దీంతో బాధితురాలి కుమారుడు గణేష్ కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన సందీప్‌కుమార్

కందుకూరు, మే 18:రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. కడ్తాల్‌లో గల బటర్‌ఫ్లై సిటీలో పనిచేస్తున్న కొంపల్లి సందీప్‌కుమార్(44), అదే గ్రామానికి చెందిన రోమియోతో కలిసి శనివారం ఉదయం బైక్‌పై హైద్రాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. గూడూరు గేటు వద్ద సందీప్‌కుమార్ బైక్‌కు ముందున్న ఆటో సిగ్నల్ ఇవ్వకుండా సడెన్‌గా, డ్రైవర్ రైట్ టర్న్ తీసుకోవడంతో సందీప్‌కుమార్ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో సందీప్‌కుమార్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రోమియో గాయాలయ్యాయి. సీఐ మక్బుల్‌జానీ, ఎస్సై శ్రావన్‌కుమార్ చేరుకొని రోమియోను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బడగూడ గేటు వద్ద డీసీఎం బోల్తా


బోల్తా పడిన డీసీఎం వాహనం

కందుకూరు, మే 18: డీసీఎం వ్యాన్ పల్టీ కొట్టగా డ్రైవర్, క్లీనర్‌లకు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం మొక్కజొన్నల లోడ్ డీసీఎం బోల్తా పడింది. డీసీఎం మక్కల లోడ్‌తో కల్వకుర్తికి వెళ్తుండగా వెళ్తుండగా దెబ్బడగూడ గేటు సమీపంలో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా పల్టీ కొట్టింది. మక్కజొన్నల బస్తాలు రోడ్డుపై పడడంతో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చేరుకొని మొక్క జొన్న బస్తాలను వేరే వ్యాన్‌లోకి తరలించారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


ఉరేసుకున్న వ్యక్తి

శంకర్‌పల్లి, మే 18 : గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారు జామున చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌పల్లి ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి బుల్కాపూర్ ఎస్వీఆర్ వెంచర్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన చెట్టుకు ఓ వ్యక్తి(35) ఉరేసుకున్నాడు. రైలు ప్రయాణికులు గమనించి డయల్ 100కు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని చెవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని, మున్సిపల్ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

1.70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొందుర్గు, మే, 18 : అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని తీసుకొని వాటికి బదులుగా జొన్నలు ఇస్తున్న వ్యక్తిని శనివారం మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాలో పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్లు ఎస్.చందర్, ఇ.శివకుమార్ శనివారం అయోధ్యపూర్ తండాలో పెట్రోలింగ్‌లో భాగంగా మధ్యాహ్నం తిరుగుతుండగా ఒక మహింద్రా ఆటో కనిపించిందన్నారు. ఆటో గురించి డ్రైవర్‌ను ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం గుర్రాలదండి తండాకు చెందిన బానోతు శ్రీను(33) షాద్‌నగర్‌లో జొన్నలను 60రూపాయలకు కిలో కొని, వాటిని అయోధ్యాపూర్ తండాలో 5కిలోల రేషన్ బియ్యానికి కిలో జొన్నల చొప్పున ఇస్తూ సేకరించాడని ఎస్సై తెలిపారు. మూడు 50కిలోల సంచులు (బ్యాగులు) మరో చిన్న సంచిలో 20 కిలోలు మొత్తం 170కిలోలు రేషన్ బియ్యం ఉండగా పట్టుకొని బియ్యం వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తూ ఎక్కువ ధరకు అమ్ముతున్న డ్రైవర్‌పై కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.


బియ్యాన్ని తరలిస్తున్న వాహనం

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

శంషాబాద్, మే 18: అంకితభావంతో కృషిచేస్తేనే గుర్తింపు వస్తుందని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు అన్నారు. బాగా పనిచేసినందుకు మున్సిపల్ వాటర్‌మెన్ డి.నగేష్, డి.యాదగిరిలకు హెచ్ఎండబ్ల్యూఎస్ ఇచ్చిన ప్రశంసాపత్రాలనుశనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అందజేశారు. ఎవరైనా సమర్థంగా విధులు నిర్వహిస్తే గుర్తింపు తప్పక వస్తుందన్నారు. కార్యక్రమంలో దశరథ, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న కమిషనర్ సుమన్‌రావు

రైతు సమస్యలపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదు


మాట్లాడుతున్న పోతుగంటి అశోక్

కడ్తాల్, మే 18: ప్రకృతి వైపరీత్యాలను కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం తగదని కడ్తాల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు. రైతు సమస్యలపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేనేలేదని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ.. అకాల వర్షాలకు పంటలు కోల్పోయి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే సేకరిస్తుందని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు రూ.2లక్షలు ఒకేసారి పంట రుణాల మాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని చర్యలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ఉన్నతాధికారులతో సమావేశాలను సైతం నిర్వహించారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి చేతులెత్తేసిందన్నారు. దీనికి బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. అధికారం పోయాక కేసీఆర్, కేటీఆర్, ఆ పార్టీ నాయకులకు రైతులు గుర్తొస్తున్నారని ఎద్దేవా చేశారు.

దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆయిళ్ల

కడ్తాల్, మే 18: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని శనివారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, కల్వకుర్తి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయిళ్ల లక్ష్మమ్మ, పద్మశ్రీ, పలనేశ్, సుగంధ్, కరుణశ్రీ, ఉమాదేవి, రేణుకాదేవి, కల్పనాదేవి, ప్రవీణ్ ఉన్నారు.


దుర్గామాత ఆలయం వద్ద ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కుటుంబీకులు

ఘనంగా ఎంపీపీ నిర్మల జన్మదిన వేడుకలు

తలకొండపల్లి, మే 18: ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు శనివారం తలకొండపల్లిలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండల పరిషత్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీటీసీ వెంకటేశ్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి నిర్మల కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ దంపతులను ఎమ్మెల్యే కసిరెడ్డి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, అంబాజీ, సరితగణేశ్, జోగు రమేశ్, హేమరాజు, రఘునాయక్, సోని, పలువురు అధికారులు, నాయకులు ఉన్నారు.


ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మే 18: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని వికారాబాద్ జిల్లా న్యాయాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అత్తెల్లిలో శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారంతో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాల అవగాహన ఉండటం వల్ల వారి వారి హక్కుల కోసం హక్కుల సాధన కోసం కృషి చేయవచ్చన్నారు. బడీడు పిల్లలను బడిలో ఉంచాలని, బాల్యంలో అందరూ చదువుకోవాలన్నారు. బాల్యంలో బాల్యవివాహాలు చేయడం నేరమని వివాహ వయస్సు వచ్చాక పెళ్ళిలు చేయాలని సూచించారు. భవన నిర్మాణ రంగం లో పని చేస్తున్న కార్మికులు లేబర్ కార్డులు తీ సుకోవాలని వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు, బీమా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమం లో అంకిత సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, లీగల్ సెల్ న్యాయవాదులు వెంకటేష్, రాము, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ హమీద్, సంస్థ సలహాదారుడు టి.వెంకటయ్య, కో ఆర్డినేటర్ సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ రత్నం, బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆరిఫ్ పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి మృతికి ఎమ్మెల్యే సంతాపం

తలకొండపల్లి, మే 18 : మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన మెకానిక్ కసిరెడ్డి నర్సింహారెడ్డి మృతిపట్ల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం తెలిపారు. శనివారం నర్సింహారెడ్డి నివాసంలో ఆయన మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి,విజేందర్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, రేణురెడ్డి,గణేశ్, శ్రీను, రూపం వెంకట్‌రెడ్డి ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే